సాక్షి మంచిర్యాల

శనివారం । 12 ఏప్రిల్ । 2025



జల సంరక్షణకు 'కృషి' 10లో▸

జిల్లాలో నీటి సంరక్షణకు కృషి సించాయి యోజన పథకంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఊటకుంటలు, చెక్‌డ్యాంలు నిర్మాణంతో నీటి నిల్వలకు ఉపయోగపడుతున్నాయి.



బీజేపీ 'గావ్ చలో బస్తీ చలో'

జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0 /25.0

మధ్యాహ్నం వేళ ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వడగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

14న డిప్యూటీ సీఎం 'భట్టి' పర్యటన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 14న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు పర్యటించనున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఏ.సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు సాయంత్రం 4.30గంటల వరకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మంచిర్యాలకు చేరుకుంటారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క రానున్నారు. 5గంటలకు ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, ఐబీ ఆవరణలో మాతాశిశు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తారు. అనంతరం గ్రామీణ కళాకారులతో సమీక్ష నిర్వహించి, ఇతర కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రికి ప్రభుత్వ గెస్ట్‌హౌజ్‌లోనే బస చేస్తారు. 15న రోడ్డు మార్గంలో బయల్దేరి హుస్నాబాద్, సిద్దిపేటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

'పంటలు బాగా పండాలి'



ఆలయంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: భక్తిభావంతో మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలని, భగవంతుని అనుగ్రహంతో రాష్ట్రంలో, నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలు పడి పంటలు బాగా పండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు మచ్చ శంకరయ్య, గుర్రం మోహన్‌రెడ్డి, సతీశ్‌కుమార్, శేషురావు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలటౌన్: రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని 2, 12వ వార్డుల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. సురేఖ మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతదేశాన్ని కాపాడుకోవడంతోపాటు రాజ్యాంగాన్ని కాపాడుకుందామని అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు.

పిల్లలకు టీకాలు వేయించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: ఏప్రిల్, మే, జూన్‌లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాచ్ అప్ టీకాలను పిల్లలకు తప్పనిసరిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులు, ఎంపీహెచ్‌పీలు, పర్యవేక్షకులతో జాతీయ టీకాల కార్యక్రమంపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లోనూ టీకాలు వేసుకోని వారిని గుర్తించి మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వేస్తారని తెలిపారు. ప్రతీ బుధ, శనివారాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అనిత చిన్నారులకు వేసే టీకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, డాక్టర్ ప్రసాద్, డెమో బుక్క వెంకటేశ్వర్, డీపీఎం ప్రశాంతి, పద్మ, ప్రవళిక పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలు' జాప్యం..!



హాజీపూర్ మండలంలో కొనుగోలు కేంద్ర వద్ద ఆరబోసుకున్న ధాన్యం

- పూర్తి స్థాయిలో ప్రారంభం కాని కేంద్రాలు
- అకాల వర్షాలతో ఆందోళనలో రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాకపోవడంతో ఇప్పటికే దిగుబడి వచ్చిన రైతులు వడ్లు ఆరబోసుకుని ఎదురు చూస్తున్నారు. మరికొందరు కోతలకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రెండు మూడు రోజులుగా ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధర క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ప్రభుత్వం ప్రకటించింది. వర్షాలు కురిస్తే ధాన్యం నీటి పాలవుతుందని కొందరు క్వింటాల్‌కు రూ.1750 నుంచి రూ.1850 ధరతో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ముందుగా సాగు చేసిన జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల మండలాల్లో వరి కోతకు వస్తోంది. ఇప్పటికే వరికోతలు పూర్తయిన వారు కేంద్రాలకు తరలించి ఎదురుచూస్తున్నారు. మబ్బులు కమ్ముకుని అక్కడక్కడ వర్షాలు కురుస్తుండడంతో ఉదయం ఆరబోసి సాయంత్రం కుప్పలు చేసి కవర్లు కప్పుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు అధికారులు ఈ నెల 10న ప్రకటించినా కొన్ని చోట్ల మాత్రమే ప్రారంభమయ్యాయి.

రెట్టింపు సేకరణ లక్ష్యం..

గతేడాది యాసంగిలో 1.08లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 1.55లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం సేకరించారు. ఈ ఏడాది జిల్లాలో 1,21,702 ఎకరాల్లో వరి సాగు కాగా, 3,41,795 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. గతేడాది కంటే రెట్టింపు 3,31,935 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఏజెన్సీల ద్వారా 321 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా..ఇప్పటి వరకు జన్నారం, లక్సెట్టిపేట, కోటపల్లి మండలాల్లో 20వరకు ప్రారంభించారు. జనవరి, ఫిబ్రవరిలో నాట్లు వేసిన పంట పొట్ట, గొలక దశలో ఉంది. నెలాఖరు వరకు ఒకేసారి పెద్దయెత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ఈలోగా పూర్తి స్థాయి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఎప్పటికప్పుడు ధాన్యం తరలిస్తే రైతులకు ఇబ్బంది ఉండదు. గత ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసి నీటి పాలైంది. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తే ఇబ్బందులు ఉండవని రైతులు కోరుతున్నారు.

ఆలస్యం చేయొద్దు



రెండు రోజులుగా మబ్బులు పడుతున్నాయి. ఈదురు గాలులు, చిరు జల్లులు కురుస్తున్నాయి. హార్వెస్టింగ్ చేసి కొ నుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబోసుకు న్న. ఇప్పుడు భారీ వర్షం వస్తే పంట వరద పాలవుతుందని భయంగా ఉంది. ఆలస్యం చేయకుండా సెంటర్ ఓపెన్ చేయాలి.

– ఎం.వెంకటేష్, గ్రామం : నమ్నూర్, మండలం : హాజీపూర్

తక్కువ ధరకే అమ్ముకున్నా..



ఓ దిక్కు మూడు రోజుల నుంచి మబ్బులు పడుతున్నాయి. సెంటర్లు ఇంకా ఒపెన్ కాలేదు. పది రోజుల కిందట నుంచి పంట కోతకు వచ్చింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కా లేదు. ఎక్కడ నీటి పాలువుతుందోనని రైస్‌మి ల్లు వద్దనే క్వింటాల్‌కు రూ.1850 ధరతో అ మ్ముకున్నా. ఈ ధర తక్కువే అయినా ఆలస్యమై తే వర్షానికి తడిసి నష్టపోవాల్సి వస్తుందని అమ్ముకోక తప్పలేదు.

– కొట్టె బుచ్చయ్య, గ్రామం : కర్ణమామిడి, మండలం : హాజీపూర్

అత్తింటి రేషన్‌కార్డులో అల్లుడి కుటుంబం



రేషన్ కార్డులో అల్లుడు, మనుమల పేర్లు

దండేపల్లి: రేషన్‌కార్డుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తుండగా తప్పులు దొర్లిన కార్డులతో విని యోగదారులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లల పేర్లు నమోదులో జరిగిన పొరపాట్లతో దరఖాస్తుదారులు కంగుతింటున్నారు. రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల నమోదుకు గతంలో పౌరసరఫరాల శాఖ అవకాశం కల్పించింది. కొన్నేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల అర్జీలు స్వీకరించడంతో మీ సేవ, ప్రజాపాలన, గ్రామసభలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీటి సంఖ్య జిల్లా వ్యాప్తంగా వేలల్లోనే ఉంటుంది. దరఖాస్తులను పరిశీలించిన అధికారులు ఆయా కుటుంబాల్లో కలిపే ప్రక్రియతోపాటు కొత్త రేషన్‌కార్డుల జారీకి కసరత్తు చేస్తున్నారు. రేషన్‌కార్డులో లేని కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయించిన వారు కొందరు తమ ఆధార్, ఎఫ్ఎస్‌సీ నంబర్లతో ఆన్‌లైన్‌లో చూస్తే అల్లుడి పేరు అత్తింటి రేషన్ కార్డుల్లో, పిల్లల పేర్లు, అమ్మమ్మ, నానమ్మల రేషన్‌కార్డుల్లో కనిపించడంతో అవాక్కవుతున్నారు.

- దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి గాజుల నగేష్‌కు ఐదేళ్ల క్రితం పెళ్లయ్యింది. తన తల్లిదండ్రుల రేషన్‌కార్డులో నుంచి తన పేరు డిలిట్ చేయించాడు. కొత్త రేషన్‌కార్డు కోసం ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్నాడు. అతడి పేరుతోపాటు ఇద్దరు పిల్లలు మహన్విత్, శ్రీనిత్ పేర్లు అత్తగారి రేషన్ కార్డు(నిర్మల్ జిల్లా కడెం మండలం దిల్‌దార్‌నగర్)లో నమోదయ్యాయి.
- దండేపల్లి మండలం ఎల్లయ్యపల్లెకు చెందిన సల్లూరి సురేష్–సంధ్య రేషన్‌కార్డు కలిగి ఉన్నారు. ప్రస్తుతం తమ కార్డులో కూతురు సుధీష పేరు నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా నానమ్మ లక్ష్మి రేషన్‌కార్డులో నమోదైంది.
- మంచిర్యాలకు చెందిన గొల్లపెల్లి సంగీత–పున్నం దంపతుల కూతురు అనన్య పేరు దండేపల్లిలో ఉండే అమ్మమ్మ సల్లూరి అమ్మాయి రేషన్ కార్డులో చేరింది.
- దండేపల్లికి చెందిన వేమునూరి శ్రీనివాస్ తన ఇద్దరు పిల్లల పేర్లు రేషన్‌కార్డులో లేకపోవడంతో మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాడు. కూతురు పేరు మాత్రమే రేషన్ కార్డులో కనిపిస్తుంది. కొడుకు పేరు రాలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా చాలామంది బాధితులు ఉన్నారు.

సాంకేతిక సమస్యలు కారణం..

రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల నమోదులో తప్పులు దొర్లడం, కొందరి పేర్లు రాకపోవడం అంతా టెక్నికల్ ఇష్యూ కారణంతోనే అయి ఉండవచ్చు. తప్పులు దొర్లినట్లు కొందరు నా దృష్టికి తీసుకు వచ్చారు. తప్పుల సవరణకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే సరి చేయవచ్చు.

– సంధ్యారాణి, తహసీల్దార్, దండేపల్లి

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి



సీఐకి సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

తాండూర్: తాండూర్, భీమిని, కన్నెపల్లి, మాదారం పోలీసుస్టేషన్ల పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు, ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని, ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మాదారం పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏ తరహా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తాండూర్ సీఐ కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గిరిజనులతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలుగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్సై సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి 'పూలే'

- సమాజ మార్పుకు కృషి చేసిన మహోన్నతుడు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



పూలే చిత్రపటం వద్ద కలెక్టర్ నివాళులు

మంచిర్యాలఅగ్రికల్చర్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, సమాజంలో మార్పు కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మాజ్యోతిబా పూలే అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ చదువు లేకపోవడమే బలహీనవర్గాల అణిచివేత, వివక్షకు కారణమని, అందరికీ విద్యనందించే దిశగా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి రహిత పంచాయతీలుగా మార్చాలి

మంచిర్యాలఅగికల్చర్: జిల్లాలో టీబీ, క్షయ వ్యాధి రహిత గ్రామ పంచాయతీలుగా మార్చాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి రాజేశ్వరి, వెనుకబడిన తరగతుల అధికారి పురుషోత్తంలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15, 16న గ్రామాల్లో ఆరేళ్లలోపు పిల్లల బరువు, ఎత్తు ఎదుగుదలపై కార్యదర్శులు పర్యవేక్షించాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు కృషి చేయాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. డీఎల్పీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సీడీపీవోలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భీమిని: ప్రజల ఫిర్యాదులపై విచారణ చేపట్టి స్థానికంగానే సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని అన్నారు. కన్నెపల్లి, చెర్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు పరిశీలించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 14 అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌లతో కలిసి జిల్లా అధికారులతో జయంతి వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 14, 15న డిప్యూటీ సీఎం, మంత్రులు మంచిర్యాలలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ, అధికారులకు సూచించారు. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ పాల్గొన్నారు.

విగ్రహం పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన ఐబీ చౌరస్తాలో పనులు పరిశీలించి సూచనలు చేశారు.

'నులి'పేసేది లేదా..!



చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

- ఫిబ్రవరిలో పంపిణీ చేయాల్సిన మాత్రలు
- కారణం లేకుండానే నిలిపివేత
- మరికొద్ది రోజుల్లో పాఠశాలలకు సెలవులు

మంచిర్యాలటౌన్: చిన్నారుల్లో నులి పురుగులు నివారించేందుకు ప్రతియేటా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే 1 నుంచి 19ఏళ్లలోపు పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. కారణమేమిటో తెలియదు గానీ ఆ కార్యక్రమానికి ఒక రోజు ముందుగానే రద్దు చేశారు. మాత్రలను జిల్లాలకు పంపిణీ చేసిన అనంతరం ఏదో సమస్యతో అన్నింటినీ తిరిగి వెనక్కి తీసుకోవడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి నిలిపి వేసినట్లు తెలిసింది. రెండు నెలలు గడుస్తున్నా మాత్రలు వేసే కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. మరో పదిహేను రోజుల్లో విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు. జూన్ 12న తిరిగి ప్రారంభిస్తారు. మరో రెండు నెలల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం లేదు. నులి పురుగుల బారిన పడిన పిల్లలు పలు రకాలుగా అనారోగ్యానికి గురవుతారు. ఈ ఆలస్యంతో వ్యాధిబారిన పడే చిన్నారులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

జిల్లాలో చిన్నారులు..

జిల్లాలో 1నుంచి 19ఏళ్లలోపు పిల్లలు 1,83,113మంది ఉన్నారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన వారు 35,706, నమోదు కాని వారు 477మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 51,403మంది, నమోదు కాని వారు 197మంది, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నమోదైన వారు 7,049, నమోదు కాని వారు 1,033మంది, ప్రైవేటు స్కూళ్లలో నమోదైన వారు 72,229, నమోదైన ఇంటర్ విద్యార్థులు 15,370మంది ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు వేస్తాం



నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఫిబ్రవరిలో చేపట్టాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల ప్రభుత్వం రద్దు చేసింది. మరోసారి నిర్వహించాల్సి ఉన్నా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

వ్యాధి సంక్రమణ ఇలా..

బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, అపరిశుభ్రమైన పరిసరాల్లో ఆటలు, చేతులు శుభ్రంగా కడుక్కోకుండా భోజనం చేయడం, చెప్పులు ధరించకుండానే మట్టిలో ఆడడం వల్ల పిల్లలు నులిపురుగుల బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధి పిల్లల్లో సాధారణంగా వచ్చేదే అయినా.. వ్యాధిబారిన పడితే పలు రకాలుగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు వండిన ఆహార పదార్థాలపై దుమ్ము పడకుండా, ఈగలు, దోమలు వాలకుండా మూతలు పెట్టాలి. వేడిగా ఉండే ఆహారం భుజించి చేతి వేలి గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. గోళ్లలో మురికి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మలమూత్ర విసర్జన బయట చేయకుండా, మరుగుదొడ్డిని వినియోగించిన అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. నులిపురుగుల బారిన పడినా, పడకపోయినా ప్రభుత్వం చేపట్టే నులిపురుగుల నివారణ కార్యక్రమంలో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి.

సేఫ్టీ కమిటీ సమావేశం బహిష్కరణ



మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

భీమారం: జైపూర్ మండలం ఐకే 1ఏ గనిలో శుక్రవారం నిర్వహించిన సేఫ్టీ కమిటీ సమావేశాన్ని పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు బహిష్కరించారు. ఈ మేరకు కమిటీ కార్యదర్శి నవీన్‌రెడ్డి నేతృత్వంలో గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో సేఫ్టీ కమిటీ సభ్యుల సూచనలు అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. భద్రతపై దృష్టి సారించి ప్రమాదరహిత గనిగా మార్చాలని డిమాండ్ చేశారు. గనిలో ప్రమాదాలు జరిగినప్పుడు యాజమాన్యం ప్రమాదస్థలానికి వెళ్లి జరిపే విచారణ కమిటీల్లో సేఫ్టీ కమిటీ సభ్యులను భాగస్వాములను చేయాలని అన్నారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ కార్మికులకు సస్పెండ్, చార్జిషీట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు సత్తయ్య, వెంకటస్వామి, రాజగోపాల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జీవో నంబరు 129పై పునఃపరిశీలించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్వోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం జీవో నంబరు 129లోని అంశాలను పునఃపరిశీలించాలని పూర్వ రెవెన్యూ వీఆర్వోలు కలెక్టర్ కుమార్ దీపక్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేసిన వీఆర్‌వోలను ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయగా తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. గత అనుభవం, సీనియారిటీ, పదోన్నతుల విషయంలో స్పష్టత లేనందున న్యాయం చేయాలని కోరారు.

పోలీసులకు రివార్డు



రివార్డు అందుకుంటున్న సీఐ ప్రమోదరావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పోలీసులను డీసీపీ భాస్కర్ శుక్రవారం రివార్డుతో సత్కరించారు. మంచిర్యాలలో రెండు గంజాయి కేసుల్లో నేరస్తులను పట్టుకున్న మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు మహేశ్‌బాబు, తిరుపతి, బ్లూకోల్ట్స్ సిబ్బంది గణేష్, హోంగార్డు సంపత్‌లకు రివార్డు అందజేశారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు సత్కరించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా మంచిర్యాలకు బదులు ఆదిలాబాద్‌లో టెన్త్ స్పాట్ మూల్యాంకనం విధులు నిర్వర్తిస్తున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఈజ్‌గాం పాఠశాల ఉపాధ్యాయురాలు సవితకు డీఈవో యాదయ్య షోకాజ్ నోటీస్ జారీ చేశారు. శుక్రవారం 'సాక్షి'లో పంతులమ్మ.. ఇదేమిటమ్మ..! శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కార్మెల్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా నియమితులైన ఉపాధ్యాయురాలు ఏప్రిల్ 7న రిపోర్టు చేయాలని సూచించగా ఆదిలాబాద్‌లో ఎస్సెస్సీ మూల్యాంకనానికి వెళ్లినందున క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో కారణం చూపాలని, రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని డీఈవో మెమో జారీ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల రైల్వేస్టేషన్ పరిధిలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల-రవీంద్రఖని రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి శరీర భాగాలు ముక్కలు ముక్కలుగా రైల్వే ట్రాక్‌పై పడి ఉన్నాయి. మృతుడి వయస్సు 35–40 ఏళ్లు ఉంటుంది. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. వివరాలకు సత్యనారాయణను 9618689879, 871265 8596 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బ లక్షణాలతో గిరిజన రైతు మృతి



పురుషోత్తం (ఫైల్)

తాంసి: భీంపూర్ మండలం కరంజి (టి) గ్రామానికి చెందిన గిరిజన రైతు వెట్టి పురుషోత్తం (40) వడదెబ్బ లక్షణాలతో గురువారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తం గురువారం మధ్యాహ్నం చేనులో పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. వడదెబ్బ లక్షణాలతో సాయంత్రం వాంతులు, విరోచనాలు చేసుకున్నాడు. గమనించిన అతడి కుటుంబీకులు సాయంత్రం స్థానికంగా చికిత్స అందించారు. వాంతులు, విరోచనాలు తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వాహనంలో మహారాష్ట్రలోని మాండ్వి పట్టణానికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్



నిందితుడు దినేశ్‌తో పోలీసులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ఏరియాలో శుక్రవారం ఎండు గంజాయి కలిగి ఉన్న పాతమంచిర్యాలకు చెందిన కోట దినేశ్ నాగేందర్‌ను పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై వినీత తెలిపారు. రాళ్లవాగు ఏరియాలో తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా 170 గ్రాముల ఎండు గంజాయి దినేశ్ వద్ద ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై అనుమానాలు



జయేందర్ (ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్ (19) అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు ఈనెల 9న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి చిరంజీవి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తుండగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువకున్ని హత్య చేసి పూడ్చిపెట్టారనే పుకార్లు రాగా శుక్రవారం కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్సై కమలాకర్ టోంకిని గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

భీమారం: మండలంలోని ఆర్కెపల్లి శివారు ప్రాంతంలో శుక్రవారం అక్రమంగా గుడుంబా తరలిస్తున్న బానోత్ రాజేందర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. అతడి నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాజేందర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట పంచాయతీ పరిధిలో శుక్రవారం పేకాడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.6,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేకాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కుస్తీతో పల్లెల దోస్తీ!

- ఉత్సవాల్లో ఆనవాయితీగా పోటీలు
- తరతరాలుగా వస్తున్న సంప్రదాయం
- 'సరిహద్దు' గ్రామాల్లో ఆదరణ



మహాగాంలో..



కామోల్ గ్రామంలో తలపడుతున్న మల్లయోధులు (ఫైల్)

భైంసా: పండుగైనా.. జాతరైనా.. కుస్తీ పోటీలు నిర్వహించడం ఇక్కడి పల్లెల ప్రత్యేకత. ముధోల్ నియోజకవర్గంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో పండుగలు, వేడుకలు, జాతరల్లో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలివస్తారు. ఒకవైపు డప్పు చప్పుళ్ల, మరోవైపు ప్రేక్షకుల ఈలలతో పోటీలు నిర్వహించే ప్రాంతం దద్దరిల్లుతుంది. మల్లయోధులు కూడా అంతే ఉత్సాహంతో తొడగొట్టి తలపడుతుంటారు. దినమంతా సాగే పోటీల్లో చివరికి డాంగోర్ కుస్తీ పేరిట పేరున్న మల్లయోధులు తలపడతారు. ఈ పోటీల్లో పలు సందర్భాల్లో కాళ్లు, చేతులు విరిగిన ఘటనలున్నాయి. ఏది ఏమైనా పోటీల్లో పాల్గొనే మల్లయోధులు అస్సలు వెనక్కి తగ్గరు.

ఇంట్లోనే వస్తాదులు..

కుభీర్ మండలంలోని ధార్‌కుభీర్‌తోపాటు కుంటాల, తానూరు మండలాల్లో తాతల నుంచి మనుమళ్ల వరకు ఒకే పోటీల్లో పాల్గొనే వారూ ఉన్నారు. వ్యవసాయ పనులు చేస్తూనే కుస్తీ పోటీలో ఎలా తలపడాలో శిక్షణ పొందుతారు. పోటీల్లో పాల్గొనే సమయంలో నడుము, తొడలు, ఇతర శరీర భాగాలు పోటీదారునికి అందనివ్వకుండా చాకచక్యంగా వారి శరీరాన్ని పట్టుకుని క్షణాల్లో మట్టి కరిపిస్తూ అందరి మెప్పు పొందుతుంటారు. ఈ మల్లయోధులు ఉత్సవ కమిటీలు ఇచ్చే నగదు కంటే తమలో సత్తా ఉందని చాటుకునేందుకే ఎక్కువగా ఆసక్తి చూపుతారు. గ్రామ సమీపాల్లోని వాగుల్లో ఇసుకపై, పంట పొలాల్లో నేలపై శిక్షణ పొందుతారు. పాలు తాగడం, పరుగెత్తడం ప్రధానంగా చేస్తుంటారు. అవలీలగా సంచులు ఎత్తుతూ.. బరువైన వస్తువులు లేపి పక్కన పెడుతూ శిక్షణ పొందుతారు. ఒక్కోసారి తమతో తలపడే మల్లయోధులను చేతులతో పైకి లేపి ఓడిస్తుంటారు. ఇందుకోసం ఏడాదంతా శ్రమిస్తూనే ఉంటారు. నాలుగు తరాల నుంచి ఇక్కడ కుస్తీపోటీలు నిర్వహించడం గమనార్హం.

పోటీకి ఆదరణ కూడా ఎక్కువే..

ముధోల్ నియోజకవర్గంలో కుస్తీకి ఎంతో ఆదరణ ఉంది. కామోల్‌లో శ్రీరామ నవమికి, మహాగాంలో మహాదేవుని జాతరకు, కుభీర్‌లో ఉగాదికి, కుంటాలలో హనుమాన్ జయంతికి, సూర్యపూర్‌లో శివరాత్రికి, ఓలాలో శివరాత్రి మరుసటి రోజున, బిలోలిలో శ్రీరామ నవమికి, భైంసా, తానూరు, ముధోల్, బాసర మండలాల్లో శివరాత్రి, ఉగాది పర్వదినాల సమయంలో, జాతరలు, పండుగలప్పుడు నిర్వహించే పోటీల్లో మల్లయోధులు తమ సత్తా చాటుకుంటారు. ఆలయ కమిటీలు, గ్రామాభివృద్ధి కమిటీలు విజేతలకు నగదు బహుమతులు అందిస్తాయి. గత 40 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ముధోల్ ప్రాంతంలో జరిగే కుస్తీ పోటీల్లో మహారాష్ట్రలోని నాందేడ్, ఉమ్రి, ధర్మాబాద్, హిమాయత్‌నగర్, బిద్రెల్లి నుంచి ఎక్కువ మంది మల్లయోధులు పాల్గొంటారు.

మా తాత నేర్పించాడు



కుస్తీ ఎలా పట్టాలో మా తాత చిన్నప్పటి నుంచే నాకు నేర్పించాడు. మా నాన్న, చిన్నాన్న అందరూ కుస్తీ పట్టేవారు. కుస్తీ పట్టడం అంటే నాకు చిన్నప్పటి నుంచి ఇష్టమే. కుస్తీ పోటీలు ఎక్కడ జరిగినా వెళ్తుంటాను. శివరాత్రి పండుగ వచ్చిందంటే ఎక్కడో ఒక చోట కుస్తీ పోటీలు జరుగుతాయి. అక్కడికి వెళ్లి పాల్గొని విజేతగా తిరిగి వస్తా.

– సొప్పురి నగేశ్, ధార్‌కుభీర్

ఎక్కడ పోటీ ఉన్నా వెళ్తా



కుస్తీ పోటీలు ఎక్కడ ఉన్నా వెళ్తాను. ఏడాదంతా ఈ పోటీల కోసం కష్టపడతాను. రోజూ పరుగెత్తి ప్రాక్టీస్ చేస్తుంటాను. నేలపై కుస్తీ పట్టడం అంత సులభంకాదు. కుస్తీ పోటీలు అందరూ చూస్తుండగా ఎదురుగా ఉన్న వ్యక్తిని ఓడిస్తే వచ్చే ఉత్సాహం చెప్పలేనిది. ఈ ప్రాంతంలో ఎక్కడ పోటీలు జరిగినా నేను అక్కడికి వెళ్తాను.

– చంద్రకాంత్, హిప్నెల్లి

వివిధ కారణాలతో ఆరుగురి ఆత్మహత్య

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ కారణాలతో ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి తనువు చాలించాడు. గొడవపడి భార్యలు పుట్టింటికి వెళ్లడంతో కుభీర్ మండలం పార్డి(బి)కి చెందిన ఒకరు, నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన యువకుడు, తలమడుగు మండలం ఉండం గ్రామానికి చెందిన మరో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అలాగే కుటుంబ సభ్యులు మందలించగా మనస్తాపంతో లోకేశ్వరం మండలం పుస్పూర్‌కు చెందిన రైతు గోదావరినదిలో దూకి తనువు చాలించాడు. కడుపు నొప్పి భరించలేక ఖానాపూర్ మండలం లచ్చునాయక్ తండాకు చెందిన మహిళ ఆత్మహత్య చేసుకుంది.

ఆకెనపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి..

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎం.శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పంటచేనులోని చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుంది. నాలుగైదురోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఆకెనపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడు బ్లూ కలర్ బనియన్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు సమాచారం ఇవ్వాలని కోరారు. పూర్తి వివరాలకు బెల్లంపల్లి రూరల్ సీఐని 871265 6561, తాళ్లగురిజాల ఎస్సైని 8712656563 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కడుపు నొప్పి భరించలేక మహిళ..

పెంబి: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పెంబి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం లచ్చునాయక్ తండాకు చెందిన నాగవత్ నీలాబాయి (45) ఏడాదిగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈక్రమంలో మద్యానికి బానిసైంది. గురువారం నీలా బాయి భర్త నరేశ్ కొడుకును తీసుకుని బంధువుల పెళ్లికి వెళ్లాడు. నీలాబాయి పరశురాం అనే రైతుకు వ్యవసాయ కూలీకి వెళ్లింది. నరేశ్ రాత్రి 9గంటలకు ఇంటికి రాగా నీలాబాయి అప్పటికీ ఇంటికి చేరుకోలేదు. గ్రామ శివారులో వెతకగా చేనులోని రేకుల షెడ్డులో పురుగుల మందు తాగి చనిపోయి కనిపించింది. నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతిరాలికి కుమారుడు, ముగ్గురు కూతుళ్లున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లడంతో ఉరేసుకుని..



సాయినాథ్ (ఫైల్)

కుభీర్: మండలంలోని పార్డి (బి)కి చెందిన పానగంటి సాయినాథ్ (46)మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం .. 15 రోజుల క్రితం సాయినాథ్ భార్య భర్త, పిల్లలను వదిలి వెళ్లిపోయింది. అప్పటినుంచి సాయినాథ్ మద్యానికి బానిసయ్యాడు. గురువారం బయటికి వెళ్లిన అతడు రాత్రి 9గంటలైనా తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం 8గంటలకు ఆయన కౌలుకు చేస్తున్న చేను ఒడ్డున గల వేపచెట్టుకు ఉరేసుకుని మృతి చెంది గ్రామస్తులకు కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడి కొడుకు బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రాంపూర్‌లో..



రమేశ్ (ఫైల్)

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్ గ్రామంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలకుంట రమేశ్ (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసై తరచూ తన భార్యతో గొడవ పడుతుండేవాడు. భరించలేని అతడి భార్య రుక్మ ఇద్దరు పిల్లలతో ఆర్నెళ్ల క్రితం లింబా (కె) గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రమేశ్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రుక్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

తలమడుగు: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఉండం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండం గ్రామానికి చెందిన వెంకటి (26) వడ్డెర వృత్తి చేసుకుని జీవనం సాగించేవాడు. రెండు నెలల క్రితం అతడి భార్య గంగమ్మతో గొడవపడ్డాడు. దీంతో గంగమ్మ నేరడిగొండలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వెంకటి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై అంజమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి నదిలో దూకి రైతు..



పాండురంగ్ (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన సిందే పాండురంగ్ (41) పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాండురంగ్ తన 10 ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనెల 5న తన రెండు ఎడ్లను అదే గ్రామానికి చెందిన ఓ దళారికి రూ.70 వేలకు విక్రయించాడు. కుటుంబ సభ్యులు నిలదీయగా ఎడ్లను వాపసు తీసుకున్నాడు. దీనిపై మనస్తాపం చెందిన పాండురంగ్ లోకేశ్వరం బ్యాంక్‌లో పని ఉందని గురువారం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి నది వంతెన వద్ద అతడి బైక్, సెల్‌ఫోన్ కనిపించింది. గోదావరి నదిలో దూకి ఉండవచ్చని భావించిన కుటుంబీకులు జాలర్లతో గాలింపు చేపట్టగా శుక్రవారం మధ్యాహ్నం పాండురంగ్ మృతదేహం లభించింది. మృతుడికి భార్య వినోద, ఇద్దరు కుమార్తెలున్నారు. వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదకారకులపై కేసు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని క్వారీ రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, ఇందుకు కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్సై వినీత తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ర్యాలీగఢ్‌పూర్‌కు చెందిన మంగురపు శ్రీకాంత్, ఆయన తల్లి చిన్నక్కతో కలిసి ద్విచక్ర వాహనంపై మంచిర్యాల నుంచి గఢ్‌పూర్‌కు వెళ్తుండగా, ఆండాళమ్మ కాలనీ దాటిన తరువాత ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, చిన్నక్కకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్డీవో ఆదేశాలతో కేసు

కాసిపేట: తప్పుడు పట్టాలు, పహణీలు సృష్టించిన వ్యక్తులపై బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లంబాడితండా గ్రామానికి చెందిన బానోతు ఈశ్వరి, అజ్మీరా జమున, అజ్మీరా రాజిలి, కున్సోత్ మోతీకి చెందిన ఆకెనపల్లి శివారులోని సర్వేనంబర్ 2/2, 2/45, 2/49, 2/15లో 10ఎకరాల 18గుంటల భూమి కేకే ఓపెన్‌కాస్టులో ఉన్నట్లుగా తప్పుడు పట్టా బుక్కులు, మీ సేవ పహణీలు సృష్టించి అక్రమంగా లబ్ధి పొందాలని ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. తప్పుడు పత్రాలతో మోసం చేయాలని చూసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగం పేరిట మోసగించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి మోసగించిన ఇద్దరిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపూరకు చెందిన మహేశ్వరి నర్స్ శిక్షణ పూర్తి చేసుకుంది. రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని స్టాఫ్ నర్స్ సోనితో పాటు గజ్జి రాజేశ్వర్ ఆమెను నమ్మించారు. వారు అడిగినట్లు మహేశ్వరి 2021లో రాజేశ్వర్ బ్యాంక్ ఖాతాకు రూ.లక్ష, ఆ తర్వాత రూ.40వేలు పంపించారు. చివరికి ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మహేశ్వరి తెలిపారు. ఈ మేరకు రాజేశ్వర్, సోనిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ వివరించారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న యువకుడి అరెస్ట్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాల బస్తీలో ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న దేవి రాహుల్ అనే యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దేవి రాహుల్ ఇంటి ఆవరణలో అక్రమంగా గంజాయి మొక్కల పెంపకం చేపట్టాడు. పక్కా సమాచారంతో వన్‌టౌన్ ఎస్సై రాకేశ్ నిందితుడి ఇంటికి వెళ్లి రెండు గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జల సంరక్షణకు 'కృషి'



చెక్‌డ్యాం (ఫైల్)

- పీఎంకేఎస్‌వైతో భూగర్భజలాల పెంపు
- పంటల సాగుకు, పర్యావరణానికి మేలు

పాత మంచిర్యాల: పరుగెత్తే నీటిని నడిపించాలి.. నడిచే నీటిని ఆపాలి.. ఆగిన నీటిని భూమిలో ఇంకింపజేయాలి.. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం 2022లో జిల్లాలో ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా జిల్లాలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నీటి నిల్వలు పెంచేందుకు జల సంరక్షణ, మట్టి సంరక్షణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రాళ్ల కట్టలు, ఊట కుంటలు, చెక్ డ్యాంలు నిర్మిస్తున్నారు. జిల్లాలోని కాసిపేట, జైపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. మరిన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే నిర్మించిన రాళ్ల కట్టలు, ఊట కుంటలు, చెక్‌డ్యాంల మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ పథకంలో భాగంగా రెండు మండలాల్లో 12 ఊట కుంటలు, మూడు చెక్ డ్యాంలు, ఐదు విడిరాళ్ల కట్టల నిర్మాణ పనులు ప్రారంభించారు. కాసిపేట మండలంలోని సోనాపూర్‌లో రూ.1.30 లక్షల నిధులతో మట్టి సంరక్షణ పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. రూ.45.6 లక్షలతో తొమ్మిది ఊట కుంటలు, రూ.17.4 లక్షల నిధులతో మూడు చెక్‌డ్యాంల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కాసిపేట మండలంలోని ఐదు గ్రామపంచాయతీల పరిధిలో, జైపూర్ మండలంలోని ఆరు పంచాయతీల పరిధిలో రూ.11.49 కోట్ల నిధులతో 340 పనులు చేపట్టేందుకు ప్రభుత్వ ఆమోదం లభించిందని తెలిపారు. 2026 మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తి చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పీఎం కేఎస్‌వై ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

రైతులకు మేలు

పీఎంకేఎస్‌వై పథకంలో భాగంగా చేపట్టే రాళ్ల కట్టలు, ఊటకుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరుగుతాయి. సమీప ప్రాంతాల్లోని రైతుల బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరుగుతుంది. దీంతో రైతులు, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది.

– కిషన్, మంచిర్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

భూగర్భజలాలు పెంచేందుకే..



భూగర్భ జల మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటి కొరత లేకుండా చేసేందుకు నీటి ఊట కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యాలను పెంచుతున్నాం. ప్రభుత్వ పథకాలతో ఇప్పటికే నిర్మించి ఉన్న కుంటలు, చెక్ డ్యాంల మరమ్మతు చేస్తున్నాం.

– శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ప్రాజెక్ట్ అధికారి, కృషి సించాయి యోజన

రాములోరి తలంబ్రాలకు విశేష స్పందన



భక్తులకు తలంబ్రాలు ఇస్తున్న ప్రణీత్

ఆదిలాబాద్: భద్రాచలం వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో ప్రారంభించిన శ్రీరాములోరి తలంబ్రాల పంపిణీ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆదిలాబాద్ ఆర్టీసీ ఇన్‌చార్జి రీజినల్ మేనేజర్ ప్రణీత్‌కుమార్ తెలిపారు. రాములోరి తలంబ్రాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు శుక్రవారం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎంతోమంది భక్తులు తలంబ్రాలను బుక్ చేసుకున్నారని పేర్కొన్నారు. మంచిర్యాల డిపో పరిధిలో అత్యధికంగా 1,397 మంది బుక్ చేసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం వీటి ద్వారా రూ. 6,56,850 ఆదాయం ఆర్టీసీకి సమకూరిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11 రీజియన్లలో లక్ష్యాన్ని సాధించిన ఆదిలాబాద్ రీజియన్ మూడో స్థానంలో నిలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివదాస్, అసిస్టెంట్ మేనేజర్ రాజేందర్, పర్సనల్ ఆఫీసర్ జిబ్లా, డిప్యూటీ సూపరింటెండెంట్ లావణ్య, సాయన్న, భక్తులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట



విలపిస్తున్న రైతు స్వామి దంపతులు

సిరికొండ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని కొండాపూర్ శివారులో జరిగింది. కొండాపూర్ శివారులో మండల కేంద్రానికి చెందిన సాయిని స్వామి, సాయిని భూమన్న పంట పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. పక్కనే ఉన్న మొక్కజొన్న పంటకు మంటలు వ్యాపించాయి. సాయిని స్వామి రెండెకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. 80 పైపులు కాలి బూడిదయ్యాయి. సాయిని భూమన్న మొక్కజొన్న పంట కూడా దగ్ధమైంది. సాయిని స్వామికి రూ.2లక్షలు, సాయిని భూమన్నకు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగింది. దీంతో బాధిత రైతులు బోరున విలపించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



పట్టుకున్న వాహనాలతో డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జైనథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, పోలీస్ సిబ్బంది శివాజీ, నర్సింగ్, మనోజ్ కలిసి జైనథ్ మండలం సాంగ్వి గ్రామంలో పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. సాంగ్వి నుంచి ఆదిలాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు తెలిపారు. వాటి డ్రైవర్లు గంగాధర్, షేక్ మోసిన్, వెంకటేశ్, సతీశ్, వాహన యజమానులు వంగల తిరుపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, కొండా లక్ష్మణ్, జ్ఞానేశ్వర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక సరఫరా చేస్తున్న పెందూరు గణేశ్, పెందూర్ మాధవ్, నాగుల నరేశ్‌పై ఇసుక దొంగతనం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



లక్ష్మణరావు (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని గోసేవా మండల్‌లో నివాసముంటున్న స్వాతంత్య్ర సమరయోధుడు, శతాధిక వృద్ధుడు రేగళ్ల లక్ష్మణరావు గురువారం రాత్రి మృతి చెందారు. స్వాతంత్య్రోద్యమంలో ఆయన పలుసార్లు జైలుకు వెళ్లారు. యుక్త వయస్సు నుంచి పురోహితుడిగా పని చేస్తున్న ఆయన జిల్లా వ్యాప్తంగా సుపరిచితుడు. లక్ష్మణరావుకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. జిల్లా కేంద్రంలో మనుమడు రాజేంద్రప్రసాద్ వద్ద ఉంటున్నాడు. తనువు చాలించేదాకా దేవతార్చన చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అత్యంత సన్నిహితులు. స్వాతంత్య్రోద్యమంలో కేవీ రమణయ్య, కేశవులుతో పాల్గొన్నారు. మంచిర్యాలలో మూడు దశాబ్దాల క్రితం మొట్టమొదటి అటుకుల గిర్ని నడిపారు. దీంతో ఆయనకు అటుకుల అయ్యగారిగా, పెద్ద అయ్యగారి గా పేరుంది. స్వాతంత్య్ర సమరయోధుడిగా రాష్ట్రపతి భవన్‌లో అప్పటి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేతుల మీదుగా సన్మానం పొందే కార్యక్రమానికి ఢిల్లీ వెళ్లాల్సి ఉండగా కరోనా పరిస్థితులు అడ్డురావడంతో వెళ్లలేదు. స్వాతంత్య్ర సమరయోధులకు ప్రభుత్వం అందించే ఐదెకరాల స్థలం చేతికందకుండా నే ఆయన పరమపదించారు. లక్ష్మణరావు పార్థీ వదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.